కథ

# బాబోయ్ బా

**"ఓ గాడ్ బా! మళ్లీ భారతం మొదలెట్టావా?" అర్జున్ అల్లరిగా బామ్మని అడిగాడు.**

**"అది కాదురా అర్జునుడూ! ఎలాగూ వచ్చావు కదా ఒక్కసారి ఆ అమ్మాయిని చూడరాదూ?" బామ్మ అర్జున్ గడ్డం పుచ్చుకుని అరగంట నుంచీ బతిమాలుతోంది.**

"నా వల్ల కాదు బా. అయినా నేనొచ్చింది పాప బర్త్‌డే కోసం. పెళ్లిచూపుల కోసం కాదు" అర్జున్ అడ్డంగా వాదిస్తున్నాడు.

"బా ఏంట్రా హాయిగా బామ్మా అని పిలవకుండా?" అర్జున్ వాళ్లమ్మ సునంద కాస్త విసుగ్గా అంది.

"నో మా! మీరా సీరియల్ చూడడం మానే దాకా మీ పేర్లు మార్చేది లేదు నువ్వు మా. బామ్మ బా అంతే" చిలిపిగా నవ్వాడు.

"అర్జున్ కాఫీ" అర్జున్ వదిన అపర్ణ కాఫీ తెచ్చిచ్చింది.

"థాంక్యూ తులసీజీ" కొంటెగా అన్నాడు.

"నిన్నూ" చిరుకోపంగా చూసింది.

"మమ్మల్నలా పిలిస్తే పిలిచావు కానీ అపర్ణనైనా చక్కగా వదినా అని పిలవరా కాస్త బావుంటుంది" బామ్మ నవ్వుతూ చెప్పింది.

"మా వదిన ఆ సీరియల్‌లో కోడలి కన్నా మంచి కోడలు కదా. అందులోనూ మీ గాంగ్‌ల మెంబర్ కదా. అలాగే పిలవాలి తప్పదు" అంటూ నవ్వుతున్నాడు అర్జున్.

అర్జున్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్‌లో ఉండగా టీవీలో ఓ హిందీ సీరియల్ మొదలయింది. అందులోనూ ఓ బామ్మ, ఆవిడ కోడళ్లు, మళ్లీ వాళ్ల కోడళ్లు సీరియల్ అంతా వాళ్ల మధ్య గొడవలూ, అభిమానాలూ, ప్రేమలూ, పెళ్లిళ్లు, ఫంక్షన్లూ. మధ్య మధ్యల్లో కడివెడు కన్నీళ్లూ, కొట్లాటలతో కొనసాగుతుండేది.

సునందా, బామ్మా దాన్ని ఇంట్రెస్టింగ్‌గా చూస్తుండే వాళ్లు. ఈలోగా అర్జున్ అన్నయ్య అరుణ్ పెళ్లయి అపర్ణ ఇంటికి రావడంతో ఆమె కూడా ఆ సీరియల్ చూసే అత్తా కోడళ్ల గాంగ్‌లో మెంబరయిపోయింది.

ఈ అయిదు సంవత్సరాల్లోనూ అర్జున్‌కి జాబ్ వచ్చి బెంగుళూరెళ్లిపోవడం అపర్ణకి పాప పుట్టటం ఇలా ఇంట్లో ఇన్ని మార్పులు జరిగినా ఆ సీరియల్ మాత్రం జీళ్లపాకంలా సాగుతూ వస్తూనే ఉంది. వాళ్లు ముగ్గురూ అంత ఓపిగ్గా ఆ పూర్ సెంటిమెంటల్ సీరియల్స్ చూడ్డం చూసి, అర్జున్ ఫన్నీగా వాళ్లకి ఆ సీరియల్ కారెక్టర్స్ పేర్లతో పిలిచి టీజ్ చేస్తుంటాడు.

"నాన్నా అర్జునుడూ! ఆ అమ్మాయి అచ్చంగా లక్ష్మీదేవిలా ఎంత ఒద్దిగ్గా ముచ్చటగా ఉంటుందనుకున్నావ్?" బామ్మ మళ్లీ మొదలెట్టింది.

"మీ లక్ష్మీదేవులు నాకొద్దు బాబోయ్!" భయం నటిస్తూ అన్నాడు అర్జున్.

"అవేం మాటల్రా?" సునంద మందలించింది.

"అసలా అమ్మాయి మౌక్తికని ఒక్కసారి చూస్తే నీకే తెలుస్తుంది" బామ్మ కాస్త ఊరిద్దామని ట్రై చేస్తోంది.

"వ్వాట్?" ఒక్క అరుపరిచాడు.

"ఆ పేరేంటి? మౌక్తికా? కట్ కట్? పరమ బోరింగ్‌గా ఉంది"

"తప్పు తప్పు" బామ్మ చెంపలేసుకుంది.

"ఆ పేరంటే ఏమనుకున్నావురా? నాసాగ్రే నవ మౌక్తికం అంటే సాక్షాత్తూ ఆ లలితాదేవి ముక్కున ఉండే ముక్కుపుడకన్నమాట. అంత గొప్పపేరు. అలా అనకూడదు" భక్తిగా చెప్పింది.

"నాకు తెలుసు బా. ఆ పేరు వినగానే నువ్వు పడిపోయావా. నీకో దణ్ణం. ఆ ముక్కుపుడకకో దణ్ణం" చిరాకు పడిపోతూ చెప్పేశాడు.

"ఏంట్రా అర్జున్ బామ్మతో అలాగేనా మాట్లాడేది. అయినా ఆ ప్రాజెక్టులంటూ ఫారిన్ కంట్రీస్‌కి తిరగడం కాదు కానీ ఇలా తయారయ్యావు" అర్జున్ వాళ్ల నాన్న మూర్తి చిన్నగా మందలించారు.

"ఓ డాడ్! మీరూ ఈ గాంగ్‌లో జాయినయ్యారా? ఇప్పుడే చెప్పేస్తున్నాను. ఇలా పెళ్లిచూపులూ అవీ నాకు పడవు. నేను మీరు చూసిన ఏ అమ్మాయినీ చేసుకోను. నాకు తెలుసు. మీరు తులసీని తెచ్చుకున్నారుగా. ఈసారి పార్వతిని తెస్తారు నాకు తెలీదా" అంటున్నాడు.

పార్వతి ఇంకో సీరియల్లోని మహా మంచి కోడలు.

"అర్జున్! మరి సాంప్రదాయాలూ, ఆచారాలూ అమ్మాయి ఫామిలీ గుణగణాలు అన్నీ చూసి చేసుకున్నాం కాబట్టి అపర్ణ చూడు మనతో ఎంత చక్కగా కలిసిపోయిందో? అలాగే మౌక్తిక కూడా" సునంద ఇంకా ఏదో చెప్పబోతోంది.

"అవునమ్మా ఒప్పుకుంటాను. వదిన మనతో చక్కగా కలిసిపోయింది. అయితే తను అన్నయ్యకి నచ్చింది కాబట్టి చేసుకున్నాడు. నాకా అమ్మాయి నచ్చదు" అన్నాడు అర్జున్.

"మౌక్తిక ఎంత బావుంటుందో తెలుసా ఒక్కసారి చూస్తే నీకే నచ్చుతుంది" అపర్ణ కల్పించుకుంది.

"నాకలాంటి ముక్కుపుడకలు నచ్చవు" తెగేసి చెప్పాడు.

"అది కాదురా ఆ అమ్మాయి చాలా స్వీట్‌గర్ల్. చూడ్డానికి క్యూట్‌గా ఉంటుంది" అరుణ్ కూడా నచ్చచెప్పున్నాడు.

"నాకు స్వీట్ గర్ల్స్ కాదు హాట్ హాట్ గర్ల్స్ కావాలి" ఇంకా మొండిగా అన్నాడు అర్జున్.

అర్జున్ చిన్నప్పట్నుంచీ అంతే. మహా మొండిఘటం. బాగా చురుకు. అతని దుడుకుతనం చూస్తే ఇంట్లో వాళ్లకి కాస్త భయమే. అందులోనూ ఇప్పుడు బెంగుళూర్‌లో ఒంటరిగా ఉంటూ ప్రాజెక్టులకి ఫారిన్ కంట్రీస్ తిరుగుతూ ఉండేసరికి అతనికి తొందరగా పెళ్లి చేసేద్దామని ఇంట్లోవాళ్లు ప్రయత్నిస్తున్నారు.

ఎరేంజ్డ్ మారేజెస్ అంటే బోరని, చేసుకుంటే లవ్‌మారేజే చేసుకోవాలని అర్జున్ అభిప్రాయం. అందుకే ఏ మాచ్ అయినా ఏదో ఒకటి చెప్పి తిరగ్గొట్టేస్తుంటాడు. అర్జున్ బాగా ఫాస్ట్ గై కాబట్టి కాస్త నిదానం ఉన్న అమ్మాయి అయితే బావుంటుందని ఇంట్లో వాళ్ల ఆలోచన.

★ ★ ★

ఆ రాత్రి భోజనాలయ్యాక అరుణ్, అపర్ణ వచ్చి కూర్చున్నారు.

"అర్జున్! లైఫ్‌లో చక్కగా సెటిలయ్యావు కదా. ఇక హాయిగా పెళ్లి చేసుకుని లైఫ్ ఎంజాయ్ చెయ్యరా" అరుణ్ మెల్లగా కదిపాడు.

"ఆ పనిమీదే ఉన్నాన్లేరా. దిగులు పడకు." అర్జున్ నవ్వాడు.

"ఆ పనిమీదే ఉంటే నీకు ఇంతవరకూ ఎవరూ ఎందుకు నచ్చలేదు" అపర్ణ వెంటనే అడిగింది.

"ఎందుకు నచ్చలేదూ బోలెడుమంది వచ్చారు" నవ్వాడు.

"అయితే వాళ్లల్లో ఎవర్నో ఒకళ్లని సెలెక్ట్ చేసుకుని మాకు చెప్పు. చూద్దాం" అన్నాడు అరుణ్.

"అన్నయ్యా! నాకు చాలామంది నచ్చారు కానీ ఇంకా నా హార్ట్ టచ్ చేసిన నా స్వీట్‌హార్ట్ ఇంకా దొరకలేదు. దొరికితే అప్పుడు చెప్తాను" అల్లరిగా అన్నాడు.

"అలాగయితే మౌక్తికని ఒక్కసారి చూడు. నీ హార్ట్ టచ్ చేస్తుందేమో" అంది అపర్ణ.

"అలాంటి ముక్కుపుడకలు నా హార్ట్ టచ్ చెయ్య

అనూరాధ



లేరు.
ఏ ఫారిన్ గర్ల్నో, అంతగా ఇండియన్స్ అయితే ఏ మల్లికా షెరావత్తో, మందిరా బేడీల్లాంటి హాట్ హాట్ గర్ల్స్ని టచ్ చెయ్యాలి" అంటున్న అర్జున్ వీపు మీద ఒక్కటేశాడు అరుణ్.

"ఒరేయ్! నువ్వు మరీ టూ మచ్ అయిపోతున్నావు కానీ బుద్ధిగా పెళ్లిచూపులకిరా. ఓసారి అమ్మాయిని చూడు. నచ్చకపోతే నన్నడుగు" అన్నాడు.

"నిన్నా?" అర్జున్ గట్టిగా నవ్వాడు.

"నీ పెళ్లిచూపులు చూశాను కదరా బాబూ. అప్పుడయితే నాకు వదినకి మెల్లకన్నుందేమో అని డౌటొచ్చింది కూడా" అని నవ్వుతున్నాడు.

"నాకు మెల్లకన్నా?" అపర్ణ కోపంగా చూసేసరికి.

"బాబోయ్ వదినా అలా చూడకు నాకు భయమేస్తుంది. ఆ రోజు పెళ్లిచూపుల్లో నువ్విలా చూస్తే నేనలా ఎందుకనుకుంటాను. ఆహా! ఆ సీన్ చూడాలి. అన్నయ్య వైపు చూస్తున్నావో తెలీదు? నా వైపు చూస్తున్నావో తెలీదు? ఎవర్ని చూసి సిగ్గుపడుతున్నావో తెలీక నేనే కన్ఫ్యూజ్ అయి చచ్చాను. ఇక వీడు.." అని అరుణ్కేసి తిరిగి నవ్వడం మొదలుపెట్టాడు.

"ఇంటికొచ్చాక వీడు నన్నేం అడిగాడో తెలుసా?" అన్నాడు.

"ఏం అడిగారు?" అపర్ణ క్యూరియస్గా చూసింది.

"ఒరేయ్! ఆ అమ్మాయి ఎవర్ని పెళ్లికొడుకనుకుందంటావ్? అనీ"

"ఏం కాదు" అరుణ్ అర్జున్ని ఓ మొట్టికాయ వేశాడు. అపర్ణ కోపంగా చూస్తుండడంతో-

"అది కాదు అపర్ణా! నేను నీ కళ్లు వాలుకళ్లా? సోగకళ్లా? అని డౌటొచ్చి ఎలా ఉన్నాయిరా అని అడిగాను అంతే" సంజాయిషీ ఇచ్చేశాడు.

"అంతమంది చుట్టాలు పక్కాల మధ్యలో కూర్చుని ఒకళ్లని ఒకళ్లు చూసుకుంటే అలాంటి డౌట్లే వస్తాయి. అయినా అలా అయిదు నిమిషాలు చూసేసుకుని ఎలా పెళ్లికి అగ్రీ అయ్యారు మీరు? అసలు మీకింక ఏ ఫీల్ ఉంటుంది? నో లవ్. నో రొమాన్స్? హౌ బోరింగ్!" అర్జున్ భుజాలెగరేశాడు.

"అందులో మజా ఏంటో నీకు తెలీదులే" వాళ్లిద్దరూ చిలిపిగా ఒకళ్లని ఒకళ్లు చూసుకుంటూ నవ్వుకున్నారు.

"మజా? ఫర్ గాడ్ సేక్! అలాంటి మాటలు చెప్పకండి. అయినా మీకు బోర్గా లేదూ. మీరసలు లైఫ్ ఏం ఎంజాయ్ చేశారు? మీకు లైఫ్లో ఇక థ్రిల్లేముంటుంది?" చిరాగ్గా అన్నాడు.

"అర్జున్! నువ్వనుకుంటున్నట్లు మా లైఫ్ బోర్ కాదురా. అందులో ఉన్న థ్రిల్ ఏంటో మాకే తెలుసు. నిజమే" మాకు ఒకళ్లని గురించి ఒకళ్లకి ఏం తెలియకుండానే పెళ్లిచూపుల్లో కూర్చున్నాం. మొదట మా చూపులు కలిశాయి. అవి మనసుల్ని తాకాయి. నెమ్మదిగా మాటలు కలిసి పెళ్లయ్యాక కూడా మేం ఒకరిని మరొకరు తెలుసుకుంటూనే మా ప్రేమని పెంచుకుంటూ పోయాం. ఈ మధ్యలో పాప పుట్టింది. అది మా ప్రేమనీ అనుబంధాన్నీ ఇంకా గాఢతరం చేసింది. అరేంజ్డ్ మ్యారేజెస్లో ఉన్న గొప్పదనం అదే.

కానీ లవ్‌మారేజెన్‌లో పెళ్లికి ముందే ప్రేమ పుడుతుంది. ఆ తర్వాత ఏడాదో, రెండేళ్లో ఆ ప్రేమ విపరీతంగా ఉంటుంది. ఇద్దరికీ కొత్తంతా పోయాక వాళ్ల పెళ్లి జరుగుతుంది. పెళ్లి తర్వాత ఏ అనుభూతి వాళ్లకి కొత్తగా ఉండదు సరి కదా అప్పుడు ఒకరిలో ఒకరికి లోపాలు కనిపించటం మొదలవుతాయి. అందుకే అరేంజ్డ్ మారేజెస్ కన్నా లవ్‌మారేజెస్‌లోనే ఫెయిల్యూర్స్ ఎక్కువ" అరుణ్ చెప్తుంటే అర్జున్ మౌనంగా వింటున్నాడు.

"ఏరా! అర్జునుడూ అయితే ఓసారి వెళ్లి మౌక్తికని చూసొద్దామా?" ఎప్పుడొచ్చిందో అర్జున్‌ని మళ్లీ అడిగింది బామ్మ.

"ఓ గాడ్! ఏదో వీడు ఆవేశంగా చెప్పున్నాడు కదా. వినకపోతే ఫీలవుతాడేమో అని విన్నానంతే. నన్ను మాత్రం ఒదిలేయండి. లేకపోతే..."

రిమోట్ తీసుకుని టీవీ సౌండ్ పెంచేస్తున్నాడు.

చెవులు చిల్లులు పడే ఆ సౌండ్‌కి అంతా గట్టిగా చెవులు మూసుకుని-

"బుద్ధి తక్కువై నీ జోలికొచ్చాం కానీ ముందా సౌండ్ తగ్గించరా చెవులు పగిలిపోతున్నాయి" బతిమిలాడుతున్నారు.

"అదీ అలా రండి దారికి" అర్జున్ నవ్వుకుంటూ సౌండ్ తగ్గించాడు. అర్జున్ మొదట్నుంచీ అంతే. తనకిష్టం లేని పని ఛస్తే చెయ్యడు. కాస్త ఫోర్స్ చేద్దామని ట్రై చేస్తే ఏదో ఒక పెంకి పని చేసి అవతలవాళ్లని లొంగదీస్తాడు.

## స్వీట్‌హోం

అందమైన భార్య, రత్నాల్లాంటి సంతానం, చూడచక్కని ఇల్లు వీటన్నిటికీ తోడు మంచి ఉద్యోగం కావాలనుకుంటారు సామాన్యులు ఎవ్వరైనా. ఇక సినిమా హీరో, హీరోయిన్స్ అయితే ఇక ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. కొత్త హీరో సోనూసూద్ ఇప్పుడో స్వీట్‌హోం ఓనరయ్యాడు. ఇక్కడో విశేషం కూడా ఉంది. సోనూ కొనుక్కున్న ఫ్లాట్ ఊర్మిళ ఫ్లాట్ ఉన్న అపార్ట్‌మెంట్‌లోనేనట. ఈ ఇంటి తర్వాత తనకి మంచి ఆఫర్లు వస్తాయని చెబుతున్నాడు. ఈ గృహయోగం అతనికి మంచి యోగాన్ని కలుగజేస్తుందేమో చూడాలి మరి.

* * *

"పదండి పదండి మళ్లీ వర్షం వచ్చేస్తుంది" బామ్మ అందర్నీ కంగారు పెట్టేస్తోంది.

"పార్టీ ఏడు గంటలకయితే ఇంకా అయిదైనా కాకుండా అక్కడికి వెళ్లి ఏం చేస్తాం? ప్రిపరేషన్స్ అన్నీ హోటల్ వాళ్లే చేస్తారు. మనం టైంకి వెళ్తే చాలు బా" అర్జున్ చిరాగ్గా అన్నాడు.

"శుభమా అంటూ పాప మొదటి పుట్టినరోజు చెయ్యబోతున్నామా? లేదా వర్షంలో వెళ్తే అది మనకే మంచిది కాదు" బామ్మ ఒప్పుకోలేదు.

అంతా కారెక్కి పాప బర్త్‌డే సెలబ్రేట్ చెయ్యడానికి బయల్దేరారు. కొంచెం దూరం వెళ్లగానే మూర్తిగారు "అరె అరుణ్! సుదర్శన్‌గార్ని పిలవడం మర్చిపోయానురా. ఒక్కసారి వాళ్ల ఇంటికెళ్లి పిల్చేసి వెళ్దాం" అన్నారు. సుదర్శన్ తనకి వాకింగ్‌లో ఈమధ్యే ఫ్రెండయ్యాడని చెప్తూ వాళ్ల ఇంటి ముందు కారాపించి మూర్తిగారూ, సునందా దిగి లోపలికెళ్లారు. ఒక్క నిమిషంలో ఆ సుదర్శన్‌గారు గబగబా వచ్చి బామ్మగారు ఇంటిదాకా వచ్చి లోపలకి రానందుకు నొచ్చుకుని, కాఫీ అయినా తాగి వెళ్లండని అందర్నీ బలవంతాన లోపలికి తీసుకెళ్లాడు.

ఇల్లు చాలా బావుందని మెచ్చుకుంటూ బయట ఉన్న చిన్న గార్డెన్‌ని చూస్తూ లోపలికి వెళ్లారు.

సుదర్శన్ భార్య సుజాత అందర్నీ మర్యాదగా పలకరించి కూర్చోపెట్టింది.

మా అమ్మగారు, నాన్నగారు అంటూ సుదర్శన్ తన తల్లిదండ్రుల్ని పరిచయం చేశారు. వాళ్లూ బాగా పెద్దవాళ్లు కావడంతో బామ్మ వెంటనే మాటలు మొదలెట్టింది.

"మా పెద్దమ్మాయి సుధ, అల్లుడు మోహన్.." సుదర్శన్ వాళ్లమ్మాయినీ అల్లుణ్నీ ఇంట్రడ్యూస్ చేస్తున్నారు. అర్జున్ కూడా సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ అని తెలిసి, మోహన్ వచ్చి అర్జున్ పక్కనే కూర్చున్నాడు.

"కాఫీ" ఏదో కోయిల పిలిచినట్లు అనిపించి మోహన్‌తో మాటల్లో ఉన్న అర్జున్ తలతిప్పి చూశాడు.


ఒక్కసారి ఏదో మెరుపు మెరిసినట్లయింది.

ఒక మెరుపుతీగ తన ముందు నిలిచి కాఫీ తీసుకోమని చెప్తోంది.

కాఫీ తీసుకుంటూ ఆమెకేసి పరిశీలనగా చూశాడు.

చంద్రబింబం లాంటి వదనం, పాలుకారే చెక్కిళ్లు, తేనెలూరే పెదవులు సన్నగా పొడుగ్గా చూడచక్కని ఫిగర్. ఆమె కట్టుకున్న లైట్ పింక్ కలర్ షిఫాన్ శారీ ఆమె ఒంటి రంగులో కలిసిపోయింది. నడుమును దాటి నాగుపాములా ఆమె నల్లని ఒత్తయిన పెద్దజడ చూడగానే ఆకర్షిస్తోంది. ఆమెలో ఏదో ఒద్దిక, పొందిక, అణకువ చూస్తుంటే ముగ్ధలాగ ముద్దుగా ఉంది.

వావ్! ఎవరీ అమ్మాయి అనుకున్నాడు.



"స్వీటీ, మా మరదలు" అని చెప్పి మోహన్ అర్జున్‌ని ఏదో ప్రాజెక్టు వివరాలు అడగసాగాడు. కానీ అర్జున్ మనస్సు అక్కడ లేదు. అతని కళ్లు ఆ అమ్మాయి కోసం చూస్తున్నాయి. అందరికీ కాఫీ ఇచ్చి ఆ అమ్మాయి వెళ్లిపోయింది.

ఒక అయిదు నిమిషాల తర్వాత స్వీట్స్, ఫ్రూట్స్ అందంగా ప్లేట్స్‌లో సర్ది తీసుకొచ్చి టీపాయ్ మీద పెట్టి అర్జున్ ఎదురుగా సోఫాలో వాళ్ల అక్క పక్కన కూర్చుంది.

అర్జున్ ఇక మోహన్‌ని వదిలేసి, తన ఎదురుగా కూర్చున్న ఆ అందాల రాశిని చూస్తూ తనెక్కడున్నదీ మర్చిపోయాడు.

ఆ అమ్మాయి కూడా చూసీ చూడనట్లు అర్జున్‌కేసి అప్పుడప్పుడూ చూస్తోంది. అతను తనకేసే తదేకంగా చూస్తుండడంతో ఆ అమ్మాయి బుగ్గలు సిగ్గుతో ముద్దమందారాలైపోయాయి. అది చూసి అర్జున్ హార్ట్ బీట్ పెరిగిపోయింది. అమ్మాయిలు సిగ్గుపడుతుంటే అంత బావుంటారని అప్పుడే తెలియడంతో పరవశంగా ఆమెనే చూస్తున్నాడు. ఆమె తనని చూసి సిగ్గు పడుతుంటే మనసంతా ఏదో అలజడిగా ఉంది. ఆ అమ్మాయి కూడా అలాంటి పరిస్థితిలోనే ఉన్నట్లు ఆమె అర్జున్‌కేసి చూస్తున్న దొంగచూపులు, అతని

కళ్లల్లో కళ్లు కలిసినప్పుడు వస్తున్న సిగ్గుతెరలు. ఆమె తన పట్ల చూపిస్తున్న పాజిటివ్ రెస్పాన్స్ అర్జున్ మనస్సును దోచేస్తున్నాయి.

"అర్జున్ వెళ్దామా?" అరుణ్ పిలిచేదాకా అర్జున్‌కి ఎక్కడున్నామన్న స్పృహ రాలేదు. అయిష్టంగా లేచి నుంచున్నాడు. అందరికీ వస్తామని చెప్తూ ఆ అమ్మాయికేసి చూశాడు.

అతనికేసే చూస్తున్న ఆమె కళ్లు అర్జున్ చూడగానే బరువుగా వాలిపోయాయి.

అర్జున్ వచ్చి కారెక్కినా అతని మనస్సు మాత్రం ఆమె దగ్గరే ఉండిపోయింది. సిగ్గుతో కందిన ఆమె మోము కళ్లల్లో నిలిచిపోయింది. ఏదో అనుభూతి గుండెని తాకింది.

* * *

"అర్జున్ నీ కళ్లు అలా ఉన్నాయేం? రాత్రి సరిగ్గా నిద్ర పట్టలేదా?" పొద్దున్న కాఫీ ఇస్తూ అపర్ణ అడిగింది.

కళ్లు అనగానే స్వీటీ కళ్లే మళ్లీ గుర్తొస్తున్నాయి. రాత్రంతా క్షణం నిద్రపట్టనివ్వని ఆమె కళ్లు వాలుకళ్లా? సోగకళ్లా? అలా చూసీచూడనట్లు చూసింది తప్ప ఒరిజినల్‌గా ఆమె కళ్లెలా ఉంటాయి? సిగ్గుబరువుతో వాలి ఉన్న ఆమె కళ్లని పూర్తిగా చూడని అర్జున్ ఆలోచిస్తున్నాడు.

"అర్జున్ స్వీట్ తింటావా?" సునంద పిలిచింది.

స్వీట్ అని వినగానే స్వీటీయే గుర్తొస్తోంది.

అరె! స్వీటీ అసలు పేరేమిటో అడగనే లేదు. ఆమెని చూస్తుంటే ఏదీ గుర్తుకు రానంతగా మైండ్ బ్లాంకయిపోయింది అనుకున్నాడు.

"ఏరా అర్జునుడూ! ఇవాళే కదూ నీ ప్రయాణం? బండి ఎంతకీ?" బామ్మ వచ్చి కూర్చుంది.

"అమ్మో! ఇవాళే ఎలా వెళ్లడం? ఎలాగైనా మళ్లీ స్వీటీని కలవాలి" అనుకుని.

"లేదు బా! ఇంకో నాలుగు రోజులు మీ అందరి దగ్గరా ఉండాలని ఉంది. ఇవాళ వెళ్లటం లేదు" అన్నాడు నవ్వుకుంటూ.

"అయితే ఇంకేం? ఒక్కసారి వెళ్లి ఆ మౌక్తికని చూసేస్తే ఓ పనైపోతుంది" బామ్మ సంబరంగా అంది.

"నేనుంటానన్నది అందుక్కాదు. అయినా ఆ రోజే చెప్పానుగా నాకలాంటి ముక్కుపుడకలు నచ్చవనీ" సీరియస్‌గా గదిలోకెళ్లిపోయాడు.

వీళ్లకి ఎదురుగా ఉన్న అమ్మాయిలు మాత్రం కనపడరెందుకు అనుకుంటూ తన గదిలో టేబుల్ మీద కనిపించిన స్వీటీ ఫోటోని ఆశ్చర్యంగా చేతిలోకి తీసుకున్నాడు.

"అరె! అర్జున్ ఈ ఫోటో ఇక్కడుందా? దీని కోసం ఇందాకట్నుంచీ వెతుకుతున్నాను ఇలా ఇవ్వు" అపర్ణ వచ్చింది.

"ఈ ఫోటో ఇక్కడికెలా వచ్చింది?" ఆశ్చర్యంగా అడిగాడు.

"స్వీటీకేమన్నా మాచ్‌లుంటే చెప్పమని నిన్న వాళ్ల నాన్నగారు ఇచ్చారు. మా కజిన్ ఒకడున్నాడు. వాడి కోసం చూస్తున్నాను ఇటివ్వు" అంది అపర్ణ.

అర్జున్‌కి ఒళ్లు మండిపోయింది.

"ఇవ్వను. ఇది నాక్కావాలి" అన్నాడు సీరియస్‌గా.

"నీకా? నీకెందుకూ?" అపర్ణ ఆశ్చర్యంగా అడిగింది.

"నాకు నచ్చింది అందుకూ" అన్నాడు పంతంగా.

"నీకు ఈ అమ్మాయి నచ్చిందా? ఏం బావుంది? అసలు ఈ అమ్మాయికి మెల్లకన్నుందేమో అని నా అనుమానం" అంది అపర్ణ వస్తున్న నవ్వుని ఆపుకుంటూ.

"మెల్లకన్నా? ఇంకా నయం అసలు నువ్వా అమ్మాయిని సరిగ్గా చూశావా?" ఫక్కుమని వినిపించిన నవ్వులకి ఉలిక్కిపడి వెనక్కి చూశాడు.

గాంగంతా అక్కడే ఉంది. అమ్మా, నాన్నా, అన్నయ్యా, బామ్మా.

"ఏరా! అయితే ముక్కుపుడక నచ్చిందా?" అరుణ్ నవ్వుతూనే అడిగాడు.

"ముక్కుపుడకా? అంటే?" అర్జున్ షాకింగ్‌గా అడిగాడు.

"అంటే మౌక్తిక ఇంకా స్వీటీ"

"ఓ గాడ్! అంటే నిన్న?" అర్జున్‌కి బల్బు వెలిగింది.

"జరిగినవి నీ పెళ్లిచూపులు. ఎలా ఉంది ఆ థ్రిల్లింగ్ ఎక్స్‌పీరియన్స్?" అరుణ్ కవ్వింపుగా అడిగాడు.

"చూపులు కలిసిన శుభవేళా ఎందుకు నీకీ పరవశమూ" అపర్ణ కూనిరాగం తీస్తూ చిలిపిగా నవ్వడంతో,

"నన్నిలా బుక్ చేశారా? అసలు మీరా సీరియల్స్ చూసే ఇంత పెద్ద యాక్టర్లయిపోయారు. ఆఖరికి బామ్మ కూడానా" విస్మయంగా అడిగాడు అర్జున్.

"ఓన్లీ యాక్షనేనా? స్క్రీన్ ప్లే, స్క్రిప్టూ ఎట్సెట్రాలన్నీ బామ్మేరా" అరుణ్ నవ్వాడు.

"బాబోయ్ బా! నువ్వా ఇదంతా చేసింది?" అర్జున్ కళ్లు తిరిగాయి.

"మరి నా ముద్దుల మనవడికి ఓ ముచ్చటైన అమ్మాయిని చూసి కట్టపెట్టకపోతే ఈ బామ్మకెలా నిద్రపడుతుందిరా అర్జునుడూ"

ఆవిడ చిద్విలాసంగా నవ్వింది.

"బా! యూ ఆర్ సో స్వీట్" అర్జున్ సిన్సియర్‌గా బామ్మకి థాంక్స్ చెప్పేస్తున్నాడు.

"ఏరా అర్జున్! మరి మల్లికా, మందిరా లాంటి హాట్ హాట్ గర్ల్స్ కానీ మౌక్తిక లాంటి స్వీట్ గర్ల్స్ నచ్చరని తెగేసి చెప్పేశావుగా మరిప్పుడేమంటావు?" అరుణ్ టీజింగ్‌గా అడిగాడు.

"ఐ డోంట్ నో రా అన్నయ్యా. మౌక్తిక నాకెందుకు నచ్చిందో నాకే తెలీదు" అర్జున్ నిజాయితీగా నిజం ఒప్పేసుకున్నాడు.

అక్కడే ఉండి అంతా వింటున్న బామ్మకెందుకో నవ్వొచ్చి-

"నాన్నా అర్జునుడూ! నువ్వనుకున్నట్లు అలాంటి హాట్ హాట్ గర్ల్స్ తాకేది కళ్లనే కానీ మనస్సుని కాదురా. ఇలాంటి స్వీట్ క్యూట్ గర్ల్స్ తాకేది డైరెక్ట్‌గా మనస్సునే, అందుకే ఆ అమ్మాయిని చూడగానే అన్నీ మర్చిపోయావు" ఆ క్షణాన బామ్మ గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణపరమాత్మలానే అర్జున్‌కి కనిపించింది.

"అమ్మబాబోయ్ బా! నీకింత నాలెడ్జ్ ఎలా వచ్చిందో నాకు బాగా అర్థమైంది కానీ, నా ముక్కుపుడకని మాత్రం మీ సీరియల్ చూసే అత్తాకోడళ్ల గాంగ్‌లో చేర్చారంటే నేనొప్పుకోను" బామ్మ మాటలు అక్షరసత్యాలని తెలిసి అర్జున్ నవ్వుతూ చెప్పాడు.

"అయితే ఇంకా ఆలస్యమెందుకు? ముహూర్తాలు పెట్టించేద్దాం" అంతా నవ్వుకుంటూ వెళ్లి సుదర్శన్‌కి ఫోన్ చేస్తున్నారు.

అర్జున్ మురిపెంగా తన చేతిలో ఉన్న మౌక్తిక ఫోటోనే చూశాడు. సోగకళ్లతో, ముగ్ధమనోహరంగా నవ్వుతున్న మౌక్తికని చూస్తూ 'ఏయ్ దొంగా! నీ చూపులతోనే నన్ను పడగొట్టేశావు కదూ? అన్నయ్య చెప్పినట్లు పెళ్లిచూపుల ఎక్స్‌పీరియన్స్ ఇంత థ్రిల్లింగ్‌గా ఉంటుందని ఇప్పుడే తెలిసింది.

అయితే ఇక మన రాబోయే స్వీట్ రొమాంటిక్ వెడ్డింగ్ లైఫ్ ఇంకెంత థ్రిల్లింగ్‌గా ఉంటుందో ఇద్దరం కలిసే చూద్దాం. బి రెడీ. ఐ లవ్‌యూ ముక్కుపుడకా సారీసారీ మౌక్తికా' చిలిపిగా నవ్వుకుంటున్నాడు. అర్జున్.

"ఏరా అర్జునుడూ! అలా ఫోటో చూసుకుంటూ కలలు కనడమేనా? ఓసారెళ్లి మౌక్తికకి కనీసం ఓ పూల గుత్తయినా ఇచ్చి, అలా బయటకు తీసుకెళ్లచ్చు కదా? ఇంతేనా నీ స్పీడు?" బామ్మ వచ్చి అర్జున్‌ని సాధించడం మొదలెట్టింది.

"బాబోయ్ బా? అసలు నువ్వీ జనరేషన్‌లో పుట్టుంటేనా? నాలాంటి అబ్బాయిల్ని ఓ ఆట ఆడించేసేదానివేమో.

నీ మనవణ్నే కదా నా స్పీడేంటో ముందు నీకే చూపిస్తాను"

తన బుగ్గమీద ఓ ముద్దు పెట్టి మౌక్తిక దగ్గరకి పరిగెడుతున్న అర్జున్‌ని చూసి బామ్మ బోసి నోటితో ముసిముసి నవ్వులు నవ్వుకుంది.

